

పెండింగ్ ఈ-చలానాలను చెల్లించేలా చూడండి: ఎస్పీ

విజయనగరం క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టి పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రికార్డులను పరిశీలించి ఆయా వాహనాలపై చలానాలు పెండింగ్‌లో ఉంటే చెల్లించే వరకూ వాహనాలు సీజ్ చేయాలన్నారు. తనిఖీల సమయంలో ఎవరైనా మద్యం సేవించి పట్టుబడితే వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. మోటారు వాహన చట్ట నిబంధనలు ఉల్లంఘించిన వారిపైనా ఈ-చలానా విధించాలని ఆదేశించారు.

దేవాడలో దోపిడీ

వైసీపీ ప్రభుత్వ హయాంలో భూమి, ఆకాశమే హద్దుగా దోపిడీ పర్వం నడిచింది. ఇసుక, మట్టి, కంకర ఇలా ఏ సహజ వనరునూ వదల్లేదు. అరుదుగా లభించే ఖనిజ సంపదను సైతం కొల్లగొట్టారు. గరివిడి మండలం దేవాడలో ఇదే మాదిరిగా మాంగనీసును పెద్ద ఎత్తున తరలించుకుపోయినట్టు తెలుస్తోంది. వందలాది ఎకరాల్లో మైనింగ్ చేసి వేల కోట్ల టన్నుల ఖనిజాన్ని దోపిడీ చేశారు. అప్పట్లో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది కొంతైతే అంతకు మించి తవ్వకాలు చేపట్టారు. దీనిపై తాజాగా ఫిర్యాదులు వచ్చాయి.

- ఇష్టారాజ్యంగా అక్రమ మైనింగ్
- మాంగనీసు తవ్వకాల్లో గోల్‌మాల్
- అనుమతి కొంత.. తవ్వకాలు లెక్కలేనంత
- లక్ష టన్నులు అదనంగా తవ్వినట్టు ఫిర్యాదులు
- అప్పట్లో లీజు టెండర్లలో సైతం మాయ

తక్కువకు కోట్ చేసిన కంపెనీకే..

మహాలక్ష్మీ మినరల్ సంస్థ అప్పటి ప్రభుత్వ పెద్దలకు బినామీ అన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం 2021 మేలో టెండర్లను ఆహ్వానించింది. మహాలక్ష్మీ మినరల్స్, ఎంపీ మినరల్స్ ఆర్‌బీఎస్ఎస్‌డీ సంస్థ, పీఎం గ్రానైట్స్ సంస్థ టెండర్లు దాఖలు చేశాయి. అయితే ఎక్కువకు కోడ్ చేసిన పీఎం గ్రానైట్ ఎక్స్‌పోర్టు సంస్థను కాదని మహాలక్ష్మీ మినరల్స్‌కు లీజుకు ఇచ్చారని, టెండర్ల నిర్వహణలో కనీస నిబంధనలు పాటించలేదన్న విమర్శలున్నాయి. ఈ లీజు టెండర్లలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోయినట్టు ఆరోపణలున్నాయి. కేవలం అప్పటి ప్రభుత్వ పెద్దల బినామీ సంస్థ కావడం వల్లే లీజు టెండర్లను మహాలక్ష్మీ మినరల్స్‌కు అప్పగించినట్టు సమాచారం.


దేవాడలో మైనింగ్ ప్రదేశం

విజయనగరం, మే 4 (ఆంధ్రజ్యోతి)

గరివిడి మండలం దేవాడ మైనింగ్ బ్లాక్ పరిధిలోని దువ్వాం, కోడూరు, కొండ పాలెంలో అపార మాంగనీసు ఖనిజాలు ఉన్నాయని అప్పట్లో కేంద్ర భూగర్భ గనుల శాఖ గుర్తించింది. వాటిపై నాటి వైసీపీ పాలకుల కన్నుపడింది. ఈ మూడు గ్రామాల పరిధిలో 81.95 హెక్టార్లలో మైనింగ్ జరుపుకునేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో ఈ-వేలం నిర్వహించింది. మహాలక్ష్మీ మినరల్స్ పేరిట నెల్లూరుకు చెందిన గూడురు శశిధర్ రెడ్డి, వెంకటరెడ్డి టెండరు దక్కించుకున్నారు.



ఇక్కడ ఏడాదికి 10 లక్షల టన్నుల ఖనిజాన్ని తవ్వుకునేందుకు వీలుగా లీజుదారుడికి అవకాశం ఇచ్చారు. ఈ నిర్ణయాన్ని అప్పట్లో స్థానికులు వ్యతిరేకించారు. ప్రజాభిప్రాయసేకరణలో సైతం గళం ఎత్తారు. ఇవేవీ అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మహాలక్ష్మీ మినరల్ సంస్థకు లీజు కట్టబెట్టేశారు. లీజు ఒప్పందానికి ముందే ఆ ప్రాంతాన్ని సదరు సంస్థ ఆధీనంలోకి తీసుకుంది. అనుమతి ఇచ్చినదానికంటే ఎక్కువగా మైనింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రూ.కోట్లాది రూపాయల విలువైన మాంగనీసును అక్రమంగా తవ్వి తరలించినట్టు చెప్పుకుంటున్నారు.

అంతకు మించి తవ్వకాలు..

లీజు సంస్థ ఏడాదికి 10 లక్షల టన్నుల ఖనిజం తవ్వకాలకు అనుమతులు తీసుకుంది. అంతకు మించి తవ్వకాలు జరుపుతోంది. లీజు పొందిన సమయానికే తవ్వకాలు మొదలుపెట్టేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.



అప్పట్లో అధికారులు గ్రామాలకు వచ్చి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. మాంగనీసు తవ్వకాలతో కాలుష్యం పెరుగుతుందని.. తమకు పునరావాసం కల్పించి, తరువాతే తవ్వకాలు చేపట్టాలని ఆ మూడు గ్రామాల ప్రజలు కోరారు. అప్పటి వైసీపీ నేతలు ప్రజాభిప్రాయ సేకరణలో సమయంలోనే దౌర్జన్యానికి దిగారు. బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. నయానో.. భయానో లీజు పొందారు. ఇప్పటివరకూ జరిపిన తవ్వకాల్లో లక్ష టన్నులకు పైగా మాంగనీసు తవ్వకాలు అక్రమంగా జరిగినట్టు బహాటంగానే ఆరోపణలున్నాయి. అధికారులు ప్రతి ఏడాది ఖనిజ తవ్వకాల కోసం అనుమతులు ఇవ్వాల్సి ఉంది. అయితే తీసుకున్న పర్మిట్‌లు కంటే ఎక్కువగా తరలిస్తున్నట్లు సమాచారం. మొత్తం మాంగనీసు తవ్వకాలు, తరలింపునకు సంబంధించి రూ.కోట్లలో అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

- దీనిపై స్థానిక జనసేన పార్టీకి చెందిన తుమ్మగంటి సూరినాయుడు మైనింగ్‌లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని మండల సమావేశాల్లో గొంతు వినిపించారు. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.
- అక్రమ మైనింగ్ అంశాన్ని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహనరావు వద్ద ప్రస్తావించగా తవ్వకాలపై ఆర్‌ఐను పంపించి పరిశీలిస్తామని, అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అమ్ముకోలేక.. దాచుకోలేక
●గిట్టుబాటు ధర సమకూరక మొక్కజొన్న రైతుల ఆవేదన
7
రాష్ట్రంలో సుస్థిరాభివృద్ధి: ఎంపీ
గ్రంథాలయ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం: ఎంపీ
7
18 కిలోల గంజాయి స్వాధీనం
భూ వివాదంపై క్షేత్రస్థాయి విచారణ

రీ సర్వేతో నేటికీ తిప్పలు

- రైతులను వీడని కష్టాలు
- అధికారులు, నేతల చుట్టూ ప్రదక్షిణలు

● గంట్యాడ మండలం కొర్లాం గ్రామంలో వైసీపీ హయాంలో భూముల రీసర్వే చేశారు. అప్పట్లో చాలా మంది రైతులకు జాయింట్ ఎల్‌పీఎం నెంబర్లు వచ్చాయి. ప్రస్తుతం వీటిని విడదీయడం చాలా కష్టం అవుతోంది. రైతులు తమ భూములను వ్యక్తిగత అవసరాలకు విక్రయించుకోలేకపోతున్నారు. అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.

● వంగర మండలం మద్దువలస గ్రామానికి చెందిన పడాల సన్యాసిరావుకు ఉన్న ఏడు ఎకరాల భూమిని రీసర్వేలో వేరొకరి పేరుమీద అధికారులు మార్పు చేశారు. దీంతో ఆ రైతు మండల రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నాడు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రి నారా లోకేశ్‌కు తెలిపాడు. దీంతో ఆ అర్జీపై కలెక్టర్ అంబేడ్కర్ విచారించారు. ఎప్పటికి పరిష్కారం అవుతుందో చూడాలి.



విజయనగరం కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడతెగని భూ సమస్యలు చాలా ఉన్నాయి. రీసర్వే బాధితులు అధికంగా ఉన్నారు. పరిష్కారం కోసం అధికారులు, నేతల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నాళ్లయినా వాటికి మోక్షం లేక నిరాశ చెందుతున్నారు. భూముల రీ సర్వే ప్రక్రియను గత వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని 2020 డిసెంబరులో మొదలు పెట్టింది. జిల్లా వ్యాప్తంగా 504 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. కాగా సర్వే పూర్తయిన చాలాచోట్ల గతంలో ఉన్న విస్తీర్ణంతో పోల్చితే తేడా వచ్చింది. ముఖ్యంగా జాయింట్ పట్టాలు విషయానికి వచ్చేసరికి ఒక సబ్‌డివిజన్‌లో ఉన్న రైతులు అందరికీ భూ హక్కు పత్రాల్లో ఒకే విస్తీర్ణం కన్పిస్తోంది. ఇప్పటికీ ఈ సమస్య పరిష్కారం కాక తిప్పలు పడుతున్నారు. ఈ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయంలో జరిగిన భూముల రీ సర్వేపై ప్రత్యేక దృష్టి (మిగతా 8వ పేజీలో..)



నీట్ పరీక్షను తనిఖీ చేసిన ఇన్‌చార్జి కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, మే 4(ఆంధ్రజ్యోతి): నగరంలో నీట్ పరీక్ష కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదివారం పరిశీలించారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష ఏర్పాట్లు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భద్రత, బందోబస్తును పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎటువంటి తప్పిదాలు జరగకూడదని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఈవో మాణిక్యంనాయుడు, పరీక్ష కేంద్రం ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ సేతుమాధవన్

ఘీంకరింపు కట్టడయ్యేనా?

- జోరుగా ఎలిఫెంట్ జోన్ పనులు
- వచ్చేనెల 15 లోగా పూర్తి చేసేలా ప్రణాళికలు
- ఆ తర్వాతే మన్యం జిల్లాకు కుంకి రాక.. గజరాజుల తరలింపు
- ఏనుగుల సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వ చర్యలు

పార్వతీపురం, మే 4(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం సీతానగరం మండలం గుచ్చిమి వద్ద ఎలిఫెంట్ జోన్‌కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాలో చురుగ్గా పనులు జరుగుతున్నాయి. అవి పూర్తయితే కుంకి సాయంతో మావటీల ద్వారా గజరాజులను అక్కడకు తరలించనున్నారు. ఆ తర్వాత జిల్లావాసులకు దీర్ఘకాలికంగా వేధిస్తున్న ఏనుగుల బెడద తప్పనుంది.

పార్వతీపురం డివిజన్‌లో ప్రస్తుతం ఎనిమిది ఏనుగులు సంచరిస్తున్నాయి. పాలకొండ డివిజన్ భామిని తదితర ప్రాంతాల్లో మరో నాలుగు గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. అవి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. మొత్తంగా జిల్లాలో ఉన్న 12 ఏనుగులు ప్రజలు, రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నిత్యం అవి ఏదో (మిగతా 8వ పేజీలో..)




శ్రీరంగరాజపురం కల్లాల్లో ఇసుక నిల్వలు

పోగేసి.. అమ్మేసి

● ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ఇసుక మాఫియా ● ఓ చోట నిల్వ చేసి ఆపై అధిక ధరకు విక్రయించి ● ఒకే బిల్లుతో పదేపదే తరలింపు ● కానరాని నిఘా

ఇసుకపై నిఘా కొరవడింది. ఇంటి అవసరాలకు మాత్రమే ఉచితంగా ఇస్తున్న ఇసుకను అదే పేరుతో కొందరు దందా చేస్తున్నారు. అక్రమంగా తవ్వేసి ఓ చోట పోగేసి ఆపై అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇంకొందరు ఒకే బిల్లుపై అనేక సార్లు ఇసుకను పట్టుకుపోతున్నారు. మరికొందరు టైరు బండితో ఇసుకను సేకరించి ఓ చోట పోగేసి నచ్చిన రేటును డిమాండ్ చేస్తున్నారు. ఈ విధంగా ఇసుకతో అక్రమార్కులు అడ్డదారిలో వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు.

గజపతినగరం/ఎస్.కోట రూరల్, మే4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుకను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చింది. ఇంటి అవసరాల వరకు ఉచితంగా ఇస్తామంది. రోజుకు ఒక వ్యక్తికి 20 టన్నులు ఇస్తోంది. ఈ ఉచిత ఇసుక పాలసీని కొందరు వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంటి కోసం అనిచెప్పి వ్యాపారం చేస్తున్నారు. గజపతి నగరం సమీపంలో చంపావతి, ఏడొంపులగెడ్డ నుంచి అక్రమంగా ఇసుకను తరలించి గ్రామాల్లో నిల్వ చేసి అమ్మకాలు చేపడుతున్నారు. గతంలో టీడీపీ హయాంలో లబ్ధిదారులకు తక్కువ ధరకు అందేలా ఇసుక విధానం తీసుకువచ్చారు. అక్రమంగా ఇసుకను నిల్వ చేసిన వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకొనేవారు. దీంతో అడ్డదారిలో రవాణా తగ్గేది. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఇష్టారాజ్యంగా ఇసుక రవాణా జరిగింది. అత్యధిక ధరకు అమ్మకాలు సాగేవి. కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకువచ్చింది. అయితే (మిగతా 8వ పేజీలో..)


శ్రీకాకుళం నుంచి తెచ్చిన ఇసుకను ఒక చోట పోగేస్తున్న దృశ్యం

అమ్ముకోలేక.. దాచుకోలేక

● గిట్టుబాటు ధర సమకూరక మొక్కజొన్న రైతుల ఆవేదన ● అకాలవర్షాలతో ఆందోళన

● కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్



ఎం.కొత్తవలసలో ఆరబెట్టిన మొక్కజొన్న పంట

గజపతినగరం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండిన పంట చేతికి వచ్చిన సమయానికి గిట్టుబాటు ధరలేక పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటను దాచుకోలేక, అమ్ముకోలేక సతమతమవుతున్నారు. వరి పంట తర్వాత అధికంగా మొక్కజొన్న పంట సాగుకు స్థానిక రైతులు ప్రాధాన్యమిస్తుంటారు. నీరు తడి తక్కువ, ప్రకృతి కలిసివస్తే అధిక దిగుబడి వచ్చి మంచి ఆదాయం వస్తుండటంతో మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఎకరా మొక్కజొన్న సాగుకు సుమారు రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. అయితే ప్రకృతి సహకరిస్తే దిగుబడి పెరిగితే రూ.30 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు.

ఈ ఏడాది విత్తన దశలోనే అకాల వర్షాలు కురిశాయి. దాంతో విత్తనం నీట మునిగి కొంతమేర మొలకెత్తక పోవడంతో రైతులు రెండో పర్యాయయం విత్తనాలు చల్లారు. గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో 3 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. గజపతినగరం మండలంలో 16,642 ఎకరాల్లో, దత్తిరాజేరు మండలంలో 554, బొండపల్లి 105, మెంటాడ మండలంలో 695 ఎకరాల్లో ఈ ఏడాది మొక్కజొన్నను సాగు చేశారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ.2,225 ప్రకటించగా రైతులు పంటను అమ్మకాలు చేపట్టలేకపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పంట కల్లాల్లోనే ఉంది. ఈనేపథ్యంలో దళారీలు సిండికేట్‌గా ఏర్పాడ్డారు. తక్కువ ధరకు పంటను చేజిక్కించుకోవాలని చూస్తున్నారు.

ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంట చేతికి వచ్చినా అమ్ముకోలేక పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కల్లాల్లో మొక్కజొన్నను కాపాడుకోవల్సి వస్తుందని వారంటున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులతో అక్కడక్కడ వర్షాలు కురవడంతో పంటను కాపాడుకోవడానికి వ్యయప్రయాసలకు పాల్పడుతున్నారు. సరైన ధరలేక పోవడంతో అమ్ముకోలేక ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు.

జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..

రైతు సేవాకేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. దళారీలను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించాం. ప్రభుత్వం మద్దతు ధర రూ.2,225 ప్రకటించింది. త్వరలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

-సీహెచ్.ధనలక్ష్మి, ఏవో, గజపతినగరం

గుర్తుతెలియని వాహనం ఢీ: మహిళ మృతి

రామభద్రపురం, మే 4(ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలోని కొండ కెంగువ బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ వెలమల ప్రసాద రావు కథనం మేరకు.. రామభద్రపురంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన చలమల సత్యవతి (65) కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ మేరకు ఆదివారం తెల్లవారుజామున మార్కెట్‌కు వెళ్తోంది. ఆ సమయంలో కొండకెంగువ బైపాస్ రోడ్డులోసాలూరు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. భర్త చలమల చిన్నా ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రమణ కేసు నమోదుచేశారు.

18 కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి సామగ్రి తరలింపు మాటున రవాణా చేసున్న గంజాయిని ఎస్.కోట పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. దీనిపై సీఐ నారాయణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేరళ రాష్ట్రానికి చెందిన ఆరుల్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తితో కలిసి ఒడిశా రాష్ట్రం నుంచి 18 కిలోల గంజాయిని లాగేజీ ఆటోలో ఇంటి సామగ్రితో పాటు తరలిస్తున్నారనే సమచారం అందిందన్నారు. దాంతో ఎస్‌ఐ గంగరాజు, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఎస్.కోట వైపు వస్తున్న ఆటోలో సామగ్రి తనిఖీ చేయడంతో 9 ప్యాకెట్లతో 18 కిలోల గంజాయి గుర్తించామన్నారు. ఆటోను తరలిస్తున్న వ్యక్తిను అదుపులోకి కేసు నమోదు చేశామని తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

నెల్లిమర్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఎస్‌ఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. గుర్ల మండలం పెదబంటుపల్లిలో నిర్వహించిన దాడిలో కొలుసు కృష్ణ 6 మద్యం సీసాలతో పట్టుబడ్డారన్నారు. అతడి నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో హెచ్‌సీ వి.కృష్ణ, పీసీ సీహెచ్.సంతోష్‌కుమార్ పాల్గొన్నారన్నారు.

భూ వివాదంపై క్షేత్రస్థాయి విచారణ



రైతులను విచారిస్తున్న తహసీల్దారు

రేగిడి, మే 4 (ఆంధ్రజ్యోతి): రేగిడి, వంగర మండలాల సరిహద్దు ప్రాంతం సరసనాపల్లి-జగన్నాథవలస రైతులకు సంబంధించిన భూ వివాదంపై తహసీల్దారు ఈశ్వరరావు ఆదివారం క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. వంగర మండలం జగన్నాథవలసకు చెందిన పడాల సన్యాశిరావు, ఆయన కుమార్తె బల్లా రుక్కిబాయి తమకు సంబంధించిన 12 ఎకరాల భూములను కొంతమంది ఆక్రమించేసి తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని మంత్రి లోకేశ్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. దానిపై కలెక్టర్ విచారణకు తహసీల్దారును ఆదేశించారు. దాంతో తహసీల్దారు ఈశ్వరరావు, ఆర్‌ఐ రేవతి, సీనియర్ అసిస్టెంట్ మురళీ.. సరసనాపల్లిలో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. జగన్నాథపురానికి చెందిన ఎనిమిది మంది రైతులు ఈ భూములు తమ తాతా తండ్రుల నుంచి సాగులో ఉన్నాయని, ఈ భూములపై తమకే హక్కులు ఉన్నాయని తహసీల్దారుకు తెలిపారు. వారి నుంచి స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశామని తహసీల్దారు తెలిపారు. సంబంధిత భూములపై 70 శాతం మందికి రాతపూర్వక హక్కులు ఏమీలేవని, సాగులో ఉన్నట్టు చెబుతున్నారని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

బెల్ట్ దుకాణాల నిర్మూలనకు చర్యలు

రాజాం, మే 4 (ఆంధ్రజ్యోతి): రాజాం పరిధిలో బెల్ట్ దుకాణాల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల పరిధిలో 55 మంది బెల్ట్ నిర్వాహకులపై కేసులు నమోదు చేసి వారి నుంచి 545 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అమ్మకాలు చేసినట్లు సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ హామీ ఇచ్చారు.

భవన నిర్మాణ అనుమతులను సవరించండి

విజయనగరం రింగురోడ్డు, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో భవన నిర్మాణ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం సవరించాలని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఐతి ఆదినారాయణ, ఆల్తి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం నగరంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భవన నిర్మాణ అనుమతుల కోసం సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం-2025ను అమలులోకి తెచ్చిందన్నారు. ఆ విధానాన్ని తెలుసుకున్నవారు దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదన్నారు. దాంతో మూడు నెలలుగా లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 300 చదరపు మీటర్ల లోపు స్థలాలకు సంబంధించి భవన నిర్మాణ అనుమతుల విషయంలో ఫ్లింత్ లెవల్ పరిశీలన బాధ్యతను ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించాలన్నారు. జీవో నెంబరు 20 విధానంపై భవన నిర్మాణదారులకు వివరించినప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దరఖాస్తుదారులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఆ నిబంధనలను సవరించాలని వారు కోరారు.

500 మందికి వైద్య పరీక్షలు



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

నెల్లిమర్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. దంతులూరి జోగి జగన్నాథ రామచంద్రరాజు జయంతిని పురస్కరించుకుని టీడీపీ నాయకుడు దంతులూరి అజయ్‌బాబు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో విజయనగరానికి చెందిన క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి వైద్యులు దాదాపు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామపెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంతకవిటిలో 135 మందికి..

● సంతకవిటి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన లైఫ్ రే ఆసుపత్రి వైద్యులు శిబిరానికి హాజరయ్యారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ పొట్నూరు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పీజీఈఏ కార్యవర్గం ఏర్పాటు



ఎన్నికైన నూతన కార్యవర్గం

విజయనగరం కలెక్టరేట్ మే 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. కె.ఎల్.పురంలోని ఏపీజీఈఏ సంఘం రాష్ట్ర ఎన్నికల అధికారి తిరుపతిరావు సమక్షంలో ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కంది వెంకటరమణ, కార్యదర్శిగా బలివాడ బాలభాస్కరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ వువ్వల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.భూషణరావు, కోశాధికారి శంకరరావు తదితరులు ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలోని రామతీర్థం, ఒమ్మి రూరల్ ఫీడర్‌ల పరిధిలోని విద్యుత్ లైన్‌ల నిర్వహణ, చెట్ల తొలగింపు పనుల కారణంగా ఆయా ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ బాల, బాలికల గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందుకు సంబంధించి జిల్లాలో నెల్లిమర్ల, గజపతినగరం గురుకుల కళాశాలల్లో పరీక్ష నిర్వహించినట్లు జిల్లా కన్వీనర్ కేబీబీ రావు తెలిపారు. నెల్లిమర్ల పరీక్ష కేంద్రంలో 401 మంది విద్యార్థులకు గానూ 297 మంది, గజపతినగరం కేంద్రంలో 198 మందికి గానూ 152 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

వేపాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామస్వామిపేటలో నిర్మించిన రామాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానానికి చెందిన వేదపండితులు శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపెద్ద గొలగాని కృష్ణమూర్తి, సర్పంచ్ వడ్లమాని శర్మ ఎమ్మెల్యేను సత్కరించారు.

సీహెచ్‌వోల సమస్యలను పరిష్కరించండి

భోగాపురం, మే4 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎన్‌జీవో భోగాపురం తాలూకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు ప్రభుత్వాన్ని కోరారు. భోగాపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలంటూ వారం రోజులుగా సీహెచ్‌వోలు సమ్మె చేస్తున్నారన్నారు. గ్రామ స్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల్లో కీలకపాత్ర వహిస్తున్న వారి డిమాండ్లు న్యాయపరంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సీహెచ్‌వోల సంఘాన్ని చర్చలకు పిలిచి వారి సమస్యలు పరిష్కరించాలని దుర్గారావు కోరారు.

నగరంలో త్యాగరాజస్వామి జయంతి

విజయనగరం బాబామెట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తఅగ్రహారంలో ఆదివారం త్యాగరాజస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. దశగి పేర్రాజు మ్యూజికల్ అకాడమి, ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఫ్రెండ్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దవళ సర్వేశ్వరరావు ప్రారంభించిన కార్యక్రమంలో స్థానిక విద్వాంసులు, సంగీత సంస్థల గురువులు, విద్యార్థులు త్యాగరాజ పంచ రత్న కృతుల గానాన్ని ఆలపించారు. మృదంగంపై మ్యూజికల్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టరు మండపాక రవి, వీణపై మంగతాయారు వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

వంద మందికి నిత్యావసరాలు

విజయనగరం రింగురోడ్డు, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓరుగంటివారి తోటలోని ప్రేమమందిరంలో ఆదివారం వంద మంది పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సత్యసాయి భజన మండలి ప్రతినిధులు అందజేశారు.

రాష్ట్రంలో సుస్థిరాభివృద్ధి: ఎంపీ కలిశెట్టి



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుస్థిరాభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర, దేశ ప్రజలు విశ్వసిస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి పునర్నిర్మాణ సభ దేశ ప్రజలందరూ గర్వించేలా విజయవంతంగా జరిగిందన్నారు. ఈ సభలో ప్రధాని మోదీ.. సీఎం చంద్రబాబుకు ఐటీ అభివృద్ధిపై ఉన్న విజన్ కోసం చర్చించారన్నారు. గత ఐదేళ్ల పాలనలో అమరావతితో పాటు రాష్ట్ర అభివృద్ధిని సర్వనాశనం చేశారన్నారు. అమరావతి పునఃనిర్మాణ ప్రారంభ వేడుకలను విజయవంతం చేసిన రాష్ట్ర ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు, వారణాసి మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

రాజాం, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేల సహకారంతో జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు ఒక డిజిటల్ గ్రంథాలయాన్ని ఎంపీ నిధులతో ఏర్పాటు చేస్తానన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సహకారంతో రాజాంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు భవనాన్ని త్వరలో పరిశీలిస్తామన్నారు. ప్రతి గ్రంథాలయంలో పత్రికలు, పుస్తకాలు, కంప్యూటర్లు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గురవాన నారాయణరావు, సుమల వెంకట మన్మథరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, టంకాల కన్నంనాయుడు, పిల్ల సత్యంనాయుడు. శిమ్మ జగన్నాథం. పొట్నూరు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.90 వేల విరాళం



విరాళం అందజేస్తున్న బంగార్రాజు

భోగాపురం, మే4(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలంలోని సారిపల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు రూ.90 వేలు విరాళం అందజేశారు. ఆదివారం మండలంలోని పోలిపల్లిలో గల నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు టీడీపీ విశాఖ నార్త్ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, డెంకాడ జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, గేదెల రాజారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ

నెల్లిమర్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొయిదలో గల తన నివాసంలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు ఇద్దరు పేద విద్యార్థినులకు ఆదివారం ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఎమ్మెల్సీ సతీమణి రోజారాణి జయంతిని పురస్కరించుకుని నగర పంచాయతీలోని జరజాపుపేటకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని చింతకాయల హారిక, గంట్యాడ మండలం కొర్లాం గ్రామానికి చెందిన గణరాజు హిమవర్షిణికి ల్యాప్‌టాప్‌లను ఆయన పంపిణీ చేశారు. అలాగే మొయిద గ్రామానికి చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని అల్లాడ మేఘనకు రూ. 10 వేల ఆర్థికసాయం చేశారు.


రామాలయంలో పూజలు

మెరకముడిదాం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లాపురంలో ఆదివారం నిర్వహించిన కోదండ రామాలయ ప్రారంభోత్సవంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. రామ్‌మల్లిక్‌నాయుడు సీతారాములను దర్శించుకున్న అనంతరం వేదపండితుల ఆశీర్వదించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనకు ఆయన రూ.20 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్ నాయుడు, తాడ్డి చంద్రశేఖర్, రెడ్డి వరం, కెంగువ ధనుంజయ, చల్లా శ్రీరామ్ తదితరులున్నారు

సీతారాములను దర్శించుకున్న జడ్పీ చైర్మన్

చెల్లాపురంలో నిర్వహించిన కోదండరామాలయ ప్రారంభోత్సంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం పురోహితులు ఆయనను ఆశీర్వదించారు. అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కోట్ల వెంకటరావు, నాయకులు బూర్లె నరేష్ కుమార్, పప్పల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కళాను పరామర్శించిన ఎంపీ కలిశెట్టి



కళాతో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

రాజాం, మే 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును రాజాంలోని ఆయన నివాసంలో ఆదివారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కలిసి పరామర్శించారు. ఇటీవల ఆయన కంటి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజకీయ అంశాలపై చర్చించారు.

దాడిపై రాద్ధాంతం తగదు



మాట్లాడుతున్న నాగార్జున

విజయనగరం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): వంగరలో వైసీపీ నాయకుడు సుదర్శనరావుపై జరిగిన దాడిని రాజకీయ రాద్ధాంతం చేయడం తగదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార లావాదేవీలు, ఇతర ఆర్థిక వ్యవహారాల కారణంగా సుదర్శనరావుపై దాడి జరిగిందన్నారు. ఆ దాడికి, రాజకీయానికి సంబంధం ఏమిటని జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లను ఆయన ప్రశ్నించారు. వంగర పోలీసు స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైన విషయం వైసీపీ నాయకులకు తెలియదా? అని నిలదీశారు. జిల్లాలో ఇటువంటి రాజకీయాలకు తెరతీయకూడదని హితవు పలికారు. ప్రశాంతమైన జిల్లాలో అలాంటి చర్యలు తగవన్నారు. ఇప్పుడిప్పుడే వంగర అభివృద్ధి చెందుతోందన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేని వారు బురద చల్లుతున్నారన్నారు. ఇటువంటి విధానాలకు ఇకపై స్వస్తి పలకాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, నడిపిల్లి రవికుమార్, మైలిపల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

లింక్ రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తా



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

వేపాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి లింక్ రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని కొండగంగుబూడి పంచాయతీలోని బంగారమ్మపేట- చిట్టివానిపాలెం గ్రామాల లింక్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంగామ్మపేట-చిట్టివానిపాలెం గ్రామాల రోడ్డుకు ఐటీడీఏ నుంచి రూ.16 లక్షలు మంజూరయ్యాయన్నారు. అలాగే చిట్టివానిపాలెం, బంగామ్మపేటలో సామాజిక భవనాలకు రూ. 15 లక్షలు చొప్పున, చిట్టివానిపాలెంలో సీసీ రోడ్డుకు రూ.8 లక్షలు, కేజేపూడి ఎస్టీ కాలనీలో సీసీ రోడ్డుకు రూ.4 లక్షలు, సంగంవలసలో సీసీ రోడ్డుకు రూ.2 లక్షలు, శొంఠివానిపాలెం-సారవానిపాలెం రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశామన్నారు. బంగారమ్మపేట, చిట్టివానిపాలెం గ్రామాల్లో పాఠశాల భవనాల నిర్మాణాలకు విశాఖ ఎంపీ శ్రీభరత్ రూ. 26 లక్షలు వెరసి కొండగంగుబూడి పంచాయితీకి రూ.96 లక్షలు మంజూరు చేశామని వివరించారు.

● కొండగంగుబూడిలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో దుంబరి బుచ్చమ్మకు చెందిన ఇల్లు దగ్ధం కావడంతో ఆమెకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, రగ్గులు అందజేశారు. పక్కా ఇల్లు మంజూరు చేసి ఆదుకుంటాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్లా వెంకటరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గనివాడ వెంకటరావు, టీడీపీ నాయకులు కన్నాజీ, సింహాద్రి, మెరపల నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో 50 కుటుంబాల చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

భోగాపురం, మే4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజేరులో గల పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో చెరుకుపల్లి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు జనసేనలో చేరాయి. వైసీపీకి చెందిన వారందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల మనసుల్లో చిగురిస్తున్న మార్పునకు ఈ చేరికలు సంకేతమన్నారు.

ఉద్యోగాలకు 103 మంది ఎంపిక



మేళాలో మాట్లాడుతున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని వివేకానంద కళాశాలలో ఆదివారం నిర్వహించిన మేళాలో 103 మందికి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో గొంప మాట్లాడుతూ నేటి యువత నైపుణ్యంపై పట్టు సాధించాలన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, నాయకులు లగుడు రవికుమార్, జుత్తాడ రామసత్యం, గుమ్మడి భారతి, రమేష్, ఇప్పాక వెంకటత్రివేణి, కల్యాణి, సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్ తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

మెరకముడిదాం, మే 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అండగా ఉంటారని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ భరోసా ఇచ్చారు. ఆదివారం మండలంలోని చినబంటుపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు కోట్ల వెంకటరావు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం లేదని కార్యకర్తలు, నాయకులు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఉపాధి కూలీలకు వేతనాలు, కొత్త పింఛన్ల మంజూరు, రైతులకు వ్యవసాయ విద్యుత్ మీటర్లు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వెంకటరమణరాజు, మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, సత్తారు జగన్మోహనరావు, బూర్లె నగేష్‌కుమార్ తదితరులున్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



పూలమాల వేస్తున్న డీఆర్వో

విజయనగరం కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి.. మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను సాధించడమే వారికి నిజమైన నివాళి అన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకుని, స్ఫూర్తిని పొందేందుకు ప్రభుత్వం ఇటువంటి కార్యాక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి జ్యోతిశ్రీ, సమగ్రశిక్ష ఏపీసీ రామారావు, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, గృహనిర్మాణ శాఖాధికారి మురళి, సహాయ మున్సిపల్ కమిషనర్ అప్పలరాజు, ఏబీసీడబ్ల్యూవో యశోదనరావు ఉన్నారు.

బురదతో బేజారు

●వర్షం కురిస్తే తప్పని అవస్థలు

● ఇదీ మజ్జిరామునిపేట వద్ద రహదారిపై పరిస్థితి

రేగిడి, మే 4, (ఆంధ్రజ్యోతి): పాలకొండ- రాజాం ప్రధాన రహదారి మార్గంలో మజ్జిరామునిపేట వద్ద ఏ పాటి వర్షం కురిసినా వాహనచోదకులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ ఏడాదిగా సీసీరోడ్డు పనులు నిలిచిపోయాయి. దాదాపు 200 మీటర్ల మేర రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ఇటీవల తాత్కాలిక మరమ్మతుల పేరుతో రహదారిపై కంకరవేసి పూడ్చారు. అయితే ప్రస్తుతం వర్షాలు వర్షాలకు రోడ్డుపై నీరు చేరుతుండడంతో బురదమయమవుతోంది. తక్షణమే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మజ్జిరామునిపేట వద్ద రోడ్డు అభివృద్ధి చేసి బురదకష్టాలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.



మజ్జిరామునిపేట వద్ద బురదమయమైన ప్రధానరోడ్డు

నిర్వహణ లేక నిరుపయోగం

●శిథిలావస్థకు చేరుతున్నవైనం

● ఇదీ రంగరాయపురం గోపాలమిత్ర భవనం పరిస్థితి

బొబ్బిలి రూరల్, మే4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగరాయపురంలో సుమారు ఎనిమిది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గోపాలమిత్ర భవనం నిర్వహణకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. టీడీపీ హయాంలో 2014-19లో పెంట, కొత్తపెంట, రంగరాయపురం, చెల్లపువలసలో పశువైద్య సేవలకోసం ఇక్కడ భవనంనిర్మించారు. వైసీపీ హయాంలో ఆర్బీకేలు ఏర్పాటుచేయడంతో గోపాలమిత్ర భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా రైతు సేవా కేంద్రంలో పశు సంవర్ధక శాఖ సహాయకులు విధులు నిర్వహిస్తున్నారని, భవనాల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పశువైద్యాధికారి సతీష్‌కుమార్ చెప్పారు.



వినియోగంలోలేని గోపాలమిత్ర భవనం

భక్తి శ్రద్ధలతో దాడితల్లి అమ్మవారి పండుగ



దాడితల్లి అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పిస్తున్న మహిళలు

బొబ్బిలిరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో గల గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి పండుగ ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో గొల్లపల్లి, ఇందిరమ్మకాలనీ, కృష్ణాపురం, గున్నతోటవలస, రంగరాయపురం, అప్పయ్యపేట తదితర 12 గ్రామాల్లో అమ్మవారి పండుగ నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేసేందుకు భక్తులు ఉదయం నుంచే క్యూకట్టారు. భక్తులు ఇబ్బందులు పడకుండా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు దాడితల్లి ఆలయం వద్ద ప్రత్యేకఏర్పాట్లు చేశారు. అమ్మవారికి పసుపు కుంకుమలు చెల్లించి ముర్రాటలు పోసి చల్లదనం చేశారు.

పోలీసు బందోబస్తు ఏర్పాటు

బొబ్బిలి, చుట్టుపక్కల 12 గ్రామాలకు ఆదివారం నుంచి దాడి తల్లి అమ్మవారి పండుగ పురస్కరించుకొని డీఎస్పీ ఆదేశాల మేరకు గ్రామాలు, పట్టణంలో పోలీసు బందో బస్తు ఏర్పాటుచేశారు. గ్రామస్థులు, పెద్దలు, కమిటీ సభ్యులు సహకరించాలని సీఐ సతీష్‌కుమార్ కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, శబ్దకాలుష్యం కలిగంచే డీజేలకు అనుమతిలేదని తెలిపారు. శాంతి భద్రతలను విఘాతం కలిగించే వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెండి కిరీటం బహూకరణ

బొబ్బిలి మండలంలోని కృష్ణాపురంలో దాడితల్లి అమ్మవారికి రెండు కేజీల ఆరు వందల గ్రాముల బరువు గల వెండి కిరీటం, చక్రం గ్రామానికి చెందిన మూడడ్ల ధనుంజయ కుటుంబసభ్యులు బహూకరించారు. ఆభరణాలను సర్పంచ్ గంట సింహాచలం చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు.



అమ్మవారి వెండి కిరీటం, చక్రం ఆలయ నిర్వాహకులకు అందజేస్తున్న మూడడ్ల ధనుంజయ కుటుంబ సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




పక్కిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు

బొబ్బిలి రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి):మండంలోని పక్కి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1988-89లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయసమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంబంగి పాఠశాలలో సరస్వతీదేవి, సర్వేపల్లిరాధాకృష్ణ, స్వామి వివేకానంద, గౌతమ్ బుద్ధుడు విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మి, అప్పటి ఉపాధ్యాయులు నారాయణమూర్తి, రెయ్యి లక్ష్మణరావు, మరియమ్మ, సర్పంచ్ గంట పైడిరాజు, విద్య కమిటీ ఛైర్మన్ ఎస్. గణపతి, హెచ్‌ఎం జీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

● బొబ్బిలి మునిసిపల్ కమిషనర్ రామలక్ష్మి



మాట్లాడుతున్న రామలక్ష్మి

బొబ్బిలి రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని బొబ్బిలి మునిసిపల్ కమిషనర్ రామలక్ష్మి కోరారు. పట్టణంలో 12 రోజులుగా జన విజ్ఞాన వేదిక, గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రమశిక్షణ, నైతికవిలువలతో కూడిన విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా తయారవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, జేవీవీ అధ్యక్షులు సత్యంనాయుడు, రౌతు వాసుదేవరావు, రమణమూర్తి, , ఉపాధ్యాయులు రమేష్, మల్లినాయుడు, శశిధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు

బొబ్బిలిరూరల్, మే4(ఆంధ్రజ్యోతి):బొబ్బిలి శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం వేసవి సెలవుల్లో భాగంగా ప్రత్యేక శిక్షణ తరగతులు గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్రాఫ్ట్, డ్రాయింగ్, గణితం, తెలుగు పద్యాలు, అట్టముక్కలతో బొమ్మలు తయారు చేయడం నేర్పించారు.కార్యక్రమంలో శంకరరావు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం

బొబ్బిలి రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): పాతబొబ్బిలికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం మింది గుంపస్వామి (90)ని బొబ్బిలి యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ సభ్యులు అధ్యక్షుడు విజయమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట ప్రపంచ నవ్వుల దినోత్సవ సందర్భంగా తమ క్లబ్ గుంపస్వామి మాస్టార్ సూచనల మేరకు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రామకృష్ణ, వెంకటరావు, రవి, గౌరి, శంకరరావు, రామారావు, కిరణ్, శివ, నీలిమ, శ్యామల పాల్గొన్నారు.

శివడవలసలో వైద్య శిబిరం

బొబ్బిలి రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శివడవలసలో ఆదివారం విజయనగరం సాయి సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ డాక్టర్ ఎ.శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, సిబ్బంది సింధు, సాయి శిరీష, హరి, సర్పంచ్ వెంగళ లక్ష్మీరాణి పాల్గొన్నారు.

జనసేనకోసం బాధ్యతగా పనిచేయాలి

బొబ్బిలి రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): జనసైనికులు ఇకపై మరింత బాధ్యతగా జనసేనకోసం పనిచేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు బాబు పాలూరు కోరారు. ఆదివారం మండలంలోని పారాది గ్రామానికి చెందిన జనసైనికులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రూపొందించిన క్రియాశీలక సభ్యత్వం కిట్లు, వారి ఐడి కార్డులు, ప్రశంసాపత్రాలను ఆదివారం వీర మహిళా విభాగం బంటుపల్లి దివ్య ఆధ్వర్యంలో అందజేశారు.కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు సంచాన గంగాధర్, బంటుపల్లి శంకరరావు,శంబాన హరిచరణ్, చీమల సతీష్, చింతాడ అనంత్, వాండ్రాసి వెంకటరమణ పాల్గొన్నారు.

పార్వతీపురంలో గాయత్రీ మహాయజ్ఞం

పార్వతీపురంటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో హిందూ ప్రచారకుడు కె.రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రీ మహాయజ్ఞాన్ని నిర్వహించారు. స్థానిక సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో గల మున్సిపల్ ఉద్యానవనంలో నిర్వహించిన నవకుండల గాయత్రీ మహాయజ్ఞంలో జిల్లా నుంచే కాక విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నాల నుంచి భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురంలో వ్యాపారమ్మ పండుగ

గుమ్మలక్ష్మీపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం గ్రామదేవత వ్యాపారమ్మ పండగకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం గ్రామ వీధుల్లో వేపకొమ్మలు కట్టారు. ఆ తర్వాత ఉజ్జిడి బండిని గ్రామం అంతా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాలకొండలో దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ

పాలకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయంలో మేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద బ్రహ్మశ్రీ జోస్యుల కూర్మనాథశర్మ, ఆంజనేయశర్మ పర్యవేక్షణలో పైల శంకరరావు దంపతులతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం

గరుగుబిల్లి, మే 4(ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయ విధానాలతో అధిక ప్రయోజనాలు పొందవచ్చని రీజినల్ టెక్నికల్ అధికారి జి.హేమ సుందర్ తెలిపారు.ఆదివారం సంతోషపురం రైతుసేవా కేంద్రం పరిధిలో రైతులకునవధాన్యాల కిట్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు ఉపయోగించుకోవాలన్నారు.రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ పి.దేవుళ్ల మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. ఏవో విజయ భారతి మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల పరిధిలో నవ ధాన్యాల కిట్లు సిద్ధంచేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జి వి.పోలినాయుడు, డి.వెంకటనాయుడు పాల్గొన్నారు.

53 మంది క్రియాశీల వలంటీర్ల నమోదు

జియ్యమ్మవలస, మే 4 (ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీల కిట్లను ఆ పార్టీ ఐటీ కోఆర్డినేటర్ రంజిత్‌కుమార్ ఆదివారం పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాల్లో 53 మంది క్రియాశీల వలంటీర్లతోపాటు 2,580 మంది పార్టీ సభ్యత్వం నమోదు చేసినట్లు తెలిపారు.

నివాస స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి):అర్హత కలిగిన వారు నివాస స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పి.బాల సూచించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సొంత స్థలాలు లేని లబ్ధిదారులు తమ సచివాలయాల పరిధిలోని డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్, రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. లబ్ధిదారునికి మూడు ఎకరాలకు మించి పల్లం భూమి, పది ఎకరాల మెట్టు భూమి దాటి ఉండరాదన్నారు. ఆదాయం 1.20 లక్షలకు మంచి ఉండకూడదని, వీటితో పాటు నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండకూడదని తెలిపారు.

●భామిని, మే 4 (ఆంధ్రజ్యోతి):అర్హులైన లబ్ధిదారులు ఇళ్ల స్థలాల కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ ఎన్.శివన్నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు అర్హత ఉన్న అన్ని కుల స్థులవారు దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి, గతంలో ఇంటి స్థలం మంజూరు కానివారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

డంపింగ్ యార్డు తరలించవద్దు

గరుగుబిల్లి, మే 4(ఆంధ్రజ్యోతి):కొంకడివరంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని సర్పంచ్ అల్లు అప్పలనాయుడుతో పాటు ఆ గ్రామస్థులు తేల్చిచెప్పారు.ఆదివారం కొంకడివరంలో విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో రాయగడ రోడ్డుకు ఆనుకుని ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును ఈ ప్రాంతానికి తరలించేందుకు చేస్తున్న సన్నాహాలు మానుకోవాలని కోరారు. ఇక్కడ యార్డు ఏర్పాటు చేయొద్దని పలు దఫాలు కలెక్టర్‌తో పాటు అధికారులకు వినతులు అందించామని చెప్పారు.అధికారులు మొండికేసి వ్యవహరిస్తే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఇప్పటికే క్వారీల నిర్వహణ కారణంగా ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నామని, దీనికి తోడు డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే మరణాలు తప్పవన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తమ ప్రాంతానికి డంపింగ్‌యార్డు తరలించవద్దని కోరారు.

సారా విక్రయిస్తే చర్యలు

గరుగుబిల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సారా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీతానగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి హెచ్చరించారు. మండలంలోని బీవీపురంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆమె ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సారా అమ్మకాల నిర్మూలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

మక్కువ, మే 4 (ఆంధ్రజ్యోతి): గోపాలపురంలో రెండు హై ఓల్టేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ కొద్దేళ్లుగా విద్యుత్ లోఓల్టేజ్ సమస్యతో గ్రామస్థులు ఇబ్బంది పడుతుండడంతో గ్రామానికి చెందిన బొత్స కన్నంనాయుడు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు. ఈ మేరకు ట్రాన్స్‌ఫార్మర్లను టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు ఆదివారం ప్రారంభించారు. సాలూరు విద్యుత్‌శాఖ ఏడీ వి.రంగారావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బి.గౌరీశంకర్, లైన్‌మన్ తెంటు సురేష్, జేఎల్ఎం ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో యధావిధిగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు ఐటీడీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్‌కు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు పీజీఆర్ఎస్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

గుమ్మలక్ష్మీపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండు రోజుల్లో అధిక వర్షాలు పడే అవకాశం ఉండడంతో అన్నిశాఖల అధికారుల వారి వారి కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శేఖర్ సూచించారు. ఆదివారం గత ప్రభుత్వంలో ప్రారంభించి, వివిధ దశల్లో ఉన్న గుమ్మలక్ష్మీపురం, లుంబేషు, ఎల్విన్‌పేట తదితర పంచాయతీ కేంద్రాల్లో సచివాలయ, ఆర్బీకే భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్మించిన భవనాలు ఏ దశలో ఉన్నాయో పరిశీలించి, కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అలాగే రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉన్న బీపీఎల్ ఎస్టీ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

జీసీసీ మేనేజర్‌గా కృష్ణప్రసాద్

గుమ్మలక్ష్మీపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ బ్రాంచి పరిధిలో ముగ్గురు అధికారులకు ప్రదోన్నతులు లభించాయి. ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్‌గా ఉంటూ జీసీసీ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపడుతున్న కృష్ణ ప్రసాద్‌కు మేనేజర్‌గా పదోన్నతి వచ్చింది. సీనియర్ జూనియర్ అసిస్టెంట్లుగా ఉన్న సాంబశివరావు, గణపతిలకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి వచ్చింది.

ఆల్ టెరైన్ వాహనాలు పునఃప్రారంభం

సీతంపేట రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఎన్టీఆర్ అడ్వంచర్‌పార్క్‌లో గత కొంత కాలంగా మరమ్మతులకు గురై నిలిపివేసిన ఆల్ టెరైన్ వాహనాలను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పునఃప్రారంభించారు. వీటిని పర్యాటకుల కోసం ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో ఆదివారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. పార్క్‌లో మరికొన్ని సాహసోపేత క్రీడలను పర్యాటకుల కోసం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఐటీడీఏ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

దిగువ ద్వారబంధంలో మలేరియా జ్వరాలు

సీతంపేట రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలో గల గిరిశిఖర గ్రామం దిగువ ద్వారబంధంలో మలేరియా జ్వరాలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో నివసిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన సవర పార్వతీ, సవరదాసు, సవర విజయ్‌లు గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. వైద్య సేవల కోసం జ్వరపీడితులు కొత్తూరు పీహెచ్‌సీని ఆశ్రయించారు. అక్కడ వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించగా మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అయితే వీరికి తెల్లరక్తకణాలు సంఖ్య క్రమేపి తగ్గుముఖం పట్టడంతో అక్కడ వైద్య సిబ్బంది మెరుగైన వైద్యసేవల కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి శుక్రవారం 108 వాహనంలో తరలించారు. అదే గ్రామంలో మరికొందరు జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

ఘీంకరింపు కట్టడయ్యేనా?

(ఐదో పేజీ తరువాయి)

ఒక చోట పంటలు, సాగు పరికరాలను ధ్వంసం చేస్తున్నాయి. జనావాసాలు, ప్రధాన రహదారుల్లోనే సంచరిస్తూ... ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలిగిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. సాయంత్రం వేళల్లో ఒంటరిగా బయటకు రాలేకపోతున్నారు. పొలాలకు వెళ్లేందుకు కూడా సాహసించలేకపోతున్నారు. గజరాజుల కారణంగా ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తమ ప్రాంతాల నుంచి వాటిని తరలించాలని కొన్నేళ్లుగా ఏనుగు బాధిత గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం

● ఏనుగుల కారణంగా జిల్లావాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. జిల్లాలో ఎలిఫెంట్ జోన్ పనుల కోసం నిధులు మంజూరు చేశారు. మొత్తంగా దీర్ఘకాలికంగా వేధిస్తున్న గజరాజుల సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించడంతో 'మన్యం' వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ● ఎలిఫెంట్ జోన్ పనులు పూర్తయితే రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక నుంచి జిల్లాకు కుంకి ఏనుగును తెప్పించనున్నారు. దాని సాయంతో జిల్లాలో ఉన్న 12 ఏనుగులను సీతానగరం మండలం గుచ్చిమి ప్రాంతంలో ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాకు తరలించనున్నారు.

క్రాల్ నిర్మాణం...

కుంకి సహకారంతో జిల్లాలో ఉన్న ఏనుగులను తాత్కాలిక ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాకు మావటీలు తీసుకొస్తారు. అనంతరం ప్రస్తుతం నిర్మిస్తున్న క్రాల్‌లో మూడు నెలల పాటు వాటిని ఉంచుతారు. మావటీలు చెప్పిన విధంగా ఏనుగులు నడుకునేలా శిక్షణను అందిస్తారు. ఆ తర్వాత వాటిని క్రాల్ నుంచి విముక్తి కలిగిస్తారు. సుమారు మూడు నెలల పాటు ఈ ప్రకియ జరుగుతుందని అంచనా.

గున్న ఏనుగుల కోసం షెడ్లు

జిల్లాలో గున్న ఏనుగులు మూడు ఉన్నాయి. వాటి కోసం ప్రత్యేకంగా షెడ్లు నిర్మిస్తున్నారు. సాధారణంగా గున్న ఏనుగులు మావటీలు చెప్పిన విధంగానే నడుచుకుంటాయి. వాటి కోసం స్విమ్మింగ్‌పూల్స్ మాదిరిగా నీటితొట్టెలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ తొట్టెల్లో నీరు నిల్వ చేసేందుకు బోరులను సిద్ధం చేస్తున్నారు. కాగా మావటీలు ప్రతి మూడు లేదా నాలుగు రోజులకొకసారి గున్న ఏనుగులకు స్నానాలు చేయిస్తారు.

ఆహారానికి..

ఏనుగులకు ఆహారాన్ని అందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 12 గజరాజులకు మావటీల సహకారంతో రోజూ ఆహారం అందించనున్నారు. కాగా జూన్ 15లోపు గుచ్చిమి వద్ద తాత్కాలిక ఎలిఫెంట్ హోల్డింగ్ పనులుపూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీని పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ట్రెంచ్‌ల ఏర్పాటు...

సుమారు ఐదున్నర కిలోమీటర్ల పొడవున ట్రెంచ్, కటింగ్ పనులు జరుగుతున్నాయి. లోతుగా ట్రెంచ్‌లు తవ్వడం వల్ల ఏనుగులు బయటకు వచ్చే అవకాశం లేదు. అవి ట్రెంచ్‌లు దాటకుండా అవసరమైన పనులు చేపడుతున్నారు. ఏనుగులు ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వేగవంతంగా పూర్తి

సీతానగరం మండలం గుచ్చిమి వద్ద తాత్కాలిక ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాలో చేపడుతున్న పనులను మరో 45 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ప్రత్యేకం కమిటీ, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కుంకి సాయంతో మావటీల ద్వారా ఏనుగులను గుచ్చిమి హోల్డింగ్ ప్రాంతానికి తరలిస్తాం.

- రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్, పార్వతీపురం

రీ సర్వేతో నేటికీ తిప్పలు

(ఐదో పేజీ తరువాయి)

పెట్టింది. రీసర్వే జరిగిన గ్రామాల్లో సభలు నిర్వహించాలని ఆదేశించడంతో రైతుల నుంచి రెవెన్యూ అధికారులు వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 24,150 వినతులు అందగా రీసర్వేకు సంబంధించి 10,510 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై కలెక్టరేట్‌లో డి సెక్షన్‌కు చెందిన రెవెన్యూ సిబ్బంది నేరుగా సంబంధిత రైతులకు ఫోన్ చేసి ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు తమ సమస్య పరిష్కారం కాలేదని వారికి వివరించినట్లు తెలిసింది. కొన్ని సమస్యల పరిష్కారం మండల స్థాయి అధికారుల చేతిలో ఉన్నా కదలిక ఉండడం లేదు.

పోగేసి.. అమ్మేసి

(ఐదో పేజీ తరువాయి)

గ్రామాల్లో అన్ని పార్టీల నాయకులు కలిసిపోయి ఇసుక దందాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.నాటుబళ్లతో తరలించి ఇసుకను నిల్వ చేసి అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలు, పట్టణాలకు ఎటువంటి అనుమతులు లేకుండా తరలించి అమ్మకాలు చేపడుతున్నారు. నిత్యం ఇసుక అక్రమంగా తరలిపోతున్నా సంబంధిత అధికారులు నిఘా పెట్టడం లేదు. గజపతినగరం మండలంలోని ఎం.గుమడాం, కొత్త శ్రీరంగరాజపురం, కెంగువ, గంగచోళ్లపెంట, పురిటిపెంట తదితర గ్రామాల్లో ఇసుక నిల్వలు అధికంగా కనిపిస్తున్నాయి. గతరెండు నెలల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ పట్టుకొన్నారు. ఒక ట్రాక్టర్ యజమానికి రూ.20వేలు, మరోట్రాక్టర్ యజమానికి రూ.10వేలు అపరాధ రుసుం విధించారు. అధికారులకు పక్కా సమాచారం ఉంటేనే దాడి చేసి పట్టుకుంటున్నారు. కానీ నిరంతర నిఘా లేదు. ఇష్టారాజ్యంగా నదుల్లో తవ్వకాలు చేపడుతుండడంతో తాగునీటి ఇబ్బందులు వస్తాయని ఆయా గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

ఒకే బిల్లుపై పలుమార్లు..

ఎస్.కోట మండలం బొడ్డవర-తాటిపూడి రోడ్డులో ఐతన్నపాలెం గ్రామం వద్ద భారీగా ఇసుక పోగులు కంట పడ్డాయి. ఆరా తీస్తే ఇక్కడో మతలబు ఉన్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో దాదాపు 90వరకు లారీలు ప్రతిరోజు శ్రీకాకుళం ప్రభుత్వ ఇసుక డిపో నుంచి రూ.5,500 నుంచి రూ.6,500 చెల్లించి బిల్లుతో ఇక్కడకు ఇసుకను తెస్తున్నాయి. తెచ్చిన ఇసుకను ఒక చోట పోగేసి వారికి నచ్చిన రేటుకు గృహ వినియోగదారులకు అమ్ముతున్నారు. ఇదో రకమైన దోపిడీ జరుగుతుండగా ఒకే బిల్లుపై పదిసార్లు ఇసుకను తీసుకొస్తున్నారని కొత్త విషయం వెలుగుచూసింది. ఎస్.కోట, వేపాడ, కొత్తవలస మండలాల్లో ఈ తరహా వ్యవహారం జరుగుతోంది. ఒకరోజు తెచ్చిన బిల్లుపై వున్న ఇసుకను ఒకచోట వేసిన తరువాత అదేబిల్లుపై ఆయా మండలాల పరిధిలో నాటుబళ్లు, ట్రాక్టర్లు తీసుకొచ్చిన ఇసుకను లారీ లోడు రూ.3వేలకు కొంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తాము శ్రీకాకుళం నుంచి ఇసుకను తెచ్చినట్లు కలరింగ్ ఇస్తూ అందర్నీ బోల్తా కొట్టిస్తున్నారు. ఒకే బిల్లుపై ఒక లారీ ద్వారా రోజుకు మూడునుంచి ఐదు లారీల ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం.

